RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | ఆదివారం | 24 -12 - 2023 | సంపుటి: 1 | సంచిక : 219 | పేజీలు : 4 | వెల : 5/-

## పీవీ గొప్ప మేధావి



3లో

# మనమే ఎక్కువ




- మద్యం అమ్మకాల్లో దక్షిణాదిలో నంబర్‌వన్
- తలసరిగా 9లీటర్ల లిక్కర్ వినియోగం
- 10.7లీటర్లు బీర్లు సేవనం
- తర్వాతి స్థానంలో తమిళనాడు



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో మద్యం అమ్మకాలు, వినియోగంపై ఎక్సైజ్‌శాఖ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమర్పించిన నివేదికలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలైన ఏపీ, తమిళనాడు, కేరళకు మించి ఇక్కడ మద్యం వినియోగిస్తున్నట్టు పేర్కొన్నారు. అంటే దక్షిణాదిలో లిక్కర్ వినియోగంలో తెలంగాణది టాప్ ప్లేస్. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం కూడా భారీగానే సమకూరుతోందని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో జనాభా ఎక్కువ.. మద్యం అమ్మకాలు తక్కువగా ఉండగా, తెలంగాణలో మాత్రం జనాభా తక్కువ.. మద్యం అమ్మకాలు ఎక్కువగా ఉన్నట్టు తేలింది. ఎక్సైజ్ అధికారుల నివేదిక ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ జనాభా 4.93 కోట్లు. 2022-23లో అక్కడ 3.35 కోట్ల లిక్కర్ (ఐఎంఎల్) కేసులు అమ్ముడుపోయాయి. దీనినిబట్టి అక్కడ తలసరి మద్యం వినియోగం 6.04 లీటర్లు. 1.16 కోట్ల కేస్‌ల బీర్లు అమ్ముడయ్యాయి. అంటే తలసరి బీర్ల వినియోగం 1.86 లీటర్లు. తమిళనాడులో తలసరి మద్యం వినియోగం 7.66 లీటర్లు కాగా, బీర్ల వినియోగం 3.75 లీటర్లు. ఇక, తెలంగాణతో దాదాపు సమాన జనాభా కలిగిన కేరళలో తలసరి లిక్కర్ వినియోగం

మిగతా 2వ పేజీలో...

# ఆపరేషన్ కంట్రోల్!



- ఈ నెల 28 నుంచి కొత్త కార్డుల ప్రక్రియ
- దరఖాస్తుల స్వీకరణకు సర్కారు ఆదేశం
- అనర్హుల ఏరివేతకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- రూ.500 సిలిండర్‌కు, కార్డుకు అవినాభావ సంబంధం
- అనర్హుల గుర్తింపునకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం
- ఎంతమంది కార్డులు పోతాయోనని అయోమయం

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో ఈ నెల 28 నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో అర్హులంతా దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధం అవుతున్నారు. రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవడం కోసం నిబంధనలు, అర్హతల గురించి ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఉన్న సమాచారం ఆధారంగా రేషన్ కార్డు తీసుకోవడానికి రూల్స్ ఈ విధంగా ఉన్నాయి..

- గ్రామీణ ప్రాంతాల్లో రూ.2 లక్షల ఆదాయంలోపు ఉన్నవారే అర్హులు
- మాగాణి 3.5 ఎకరాలు, బీడు భూములైతే 7.5 ఎకరాలలోపు ఉండాలి
- గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.15 వేల లోపు ఆదాయం

అయితే రాష్ట్రంలో ఇప్పటికే దాదాపు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. రాష్ట్ర జనాభా 3 కోట్ల 95 లక్షలు కాగా.. తెలంగాణలో రేషన్ లబ్ధిదారులు 2 కోట్ల 85 లక్షల మంది ఉన్నారు. దీంతో చాలా మంది అనర్హులకు కూడా రేషన్ కార్డులు ఉన్నాయన్న వాదన చాలా రోజులుగా ఉంది. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం అనర్హులకు కార్డులు తొలగించే అవకాశం ఉందని తెలుస్తోంది. గతంలో రేషన్ కార్డు ఉండి ఇప్పుడు ఆర్థికంగా స్థిరపడితే వారిని అనర్హులుగా ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆదాయం ఎక్కువ ఉంటే రేషన్ కార్డు సరెండర్ చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ కింది వారు రేషన్ కార్డు తీసుకోవడానికి అనర్హులుగా నిర్ణయించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల నుంచి సమాచారం.

- ప్రొఫెషనల్ ట్యాక్స్, ఇన్‌కం ట్యాక్స్, సేల్స్ ట్యాక్స్ చెల్లించినా అనర్హులే
- డాక్టర్లు, లాయర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు రేషన్ కార్డుకు అనర్హులే
- పైన ఇచ్చిన నిబంధనల పరిధిలోకి రాని వారిని కూడా రేషన్ కార్డు పొందేందుకు అనర్హులుగా నిర్ణయించే ఛాన్స్ ఉంది.

ఇంకా ఏళ్లుగా రేషన్ తీసుకోని వారిని కూడా అనర్హులుగా ప్రకటించే ఛాన్స్ ఉంది. గత ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులను ప్రామాణికంగా చేశాయి. దీంతో ఎలాగైనా రేషన్ కార్డులను

మిగతా 2వ పేజీలో...



## సమ్మక్క జాతరకు జాతీయ హోదా కల్పించండి..

రాష్ట్రపతికి మంత్రి సీతక్క వినతి

2లో





## కేయూలో ర్యాగింగ్

విద్యార్థుల్లో ఆందోళన

3లో



## మంత్రివర్గ విస్తరణ కోసం ఎదురుచూపులు

- ఆశావహుల్లో గుబులు
- ముమ్మరంగా పైరవీలు
- గాడ్‌ఫాదర్ల చుట్టూ ప్రదక్షిణలు

4లో

# కారు లేని కార్మిక పోరు!

- సింగరేణి ఎన్నికలకు టీబీజీకేఎస్ దూరం
- గుర్తింపు సంఘంగా పదేళ్లు గుత్తాధిపత్యం
- కాంగ్రెస్ అనుబంధ సంఘం వైపు దృష్టి
- ఇక రెండు సంఘాల మధ్యే అసలు సమరం
- కార్మికులను మచ్చిక చేసే పనిలో నిమగ్నం
- పావులు కదుపుతున్న ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ





**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సింగరేణిలో కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో పాగా వేయటానికి అటు ఏఐటీయూసీ ఇటు ఐఎన్టీయూసీ పావులు కదుపుతున్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్-సీపీఐ అనుబంధ సంఘాలు ఐక్యంగా పోరాడి ఓటమి పాలయ్యాయి. గత రెండుసార్లుగా టీఆర్ఎస్ అనుబంధ సంస్థ టీబీజీకేఎస్ గెలుపొందుతూ మూడోసారి హ్యాట్రిక్ కొట్టడానికి ప్రయత్నాలు చేస్తోంది. కానీ బీఆర్ఎస్ నాయకత్వం తమ కార్మిక నాయకులకు షాక్ ఇచ్చింది. బీఆర్ఎస్ పార్టీ సింగరేణి ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయం చేసుకోవడంతో ఆ పార్టీ అనుబంధ సంఘానికి నాయకులైన

మిగతా 2వ పేజీలో...

# నమోస్తుతే..!




- బీజేపీకి శక్తిమంత్రంగా మోదీ నామస్మరణం
- వచ్చే పార్లమెంటు ఎన్నికలకు అదే తంత్రం
- మూడోసారి అధికారం దిశగా చక్రవ్యూహం
- శ్రేణులను సిద్ధం చేస్తున్న అధినాయకత్వం
- ఢిల్లీ మీటింగులో పలు నిర్ణయాలకు అవకాశం

**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :** లోక్‌సభ ఎన్నికల కోసం బీజేపీ తన నినాదాన్ని సిద్ధం చేసింది. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల కోసం 'మేం నేస్తం వాస్తవమే, కలలు కాదు, అందుకే అందరూ మోదీని ఎన్నుకుంటారు' అనేనినాదాన్ని ఆ పార్టీ రూపొందించింది. లోక్‌సభ ఎన్నికల సన్నాహకానికి సంబంధించి శుక్రవారం నుంచి ఢిల్లీలో రెండు రోజులపాటు పార్టీ ముఖ్యనేతల సమావేశం ప్రారంభం కానున్న తరుణంలో బీజేపీ ఈ నినాదాన్ని ఎంచుకుంది. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న ఈ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు నేతలు ఇందులో పాల్గొంటారు. ఇటీవల జరిగిన 5రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడంతో గడువు కంటే ముందే లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతోంది. నెల రోజుల ముందుగానే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని సమాచారం. మూడు రాష్ట్రాల్లో బీజేపీ సాధించిన విజయంతో జోరు మీదున్న బీజేపీ లోక్‌సభ ఎన్నికలను ముందుగానిర్వహించాలని భావిస్తోంది. ఫిబ్రవరి నెల 20వతేదీ లోపు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి, మార్చి 7 నుంచి పది దశల్లో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల కమిషన్ యోచిస్తున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశంలో వికాస్ భారత్ సంకల్ప్ అభియాన్‌తో పాటు ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మిజోరాం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కూడా చర్చించే అవకాశం ఉంది. నిజానికి హిందీ

మిగతా 2వ పేజీలో...

# ఛలో ఢిల్లీ!



- పార్లమెంటు ఎన్నికలపై పలువురు గురి
- ముందు వరుసలో అసెంబ్లీ ఎలక్షన్లలో ఓడిన వారే
- టీబీజేపీ నేతలు ఇప్పటికే టికెట్ల వేటలో నిమగ్నం
- ఇతర పార్టీల్లోనూ ఆశావహుల్లో ఎనలేని ఆరాటం
- అధిష్ఠానం ఆశీస్సుల కోసం ముమ్మర ప్రయత్నం

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** ఆ నేతలు పార్లమెంటు సీటుపై కన్నేశారా..? అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సై అంటున్నారా..? లోక్ సభకు పోటీ చేసేందుకు పావులు కదుపుతున్నారా..? ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.. అదే అనిపిస్తోంది. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అప్పుడే లాబీయింగ్ మొదలు పెట్టినట్లు కనిపిస్తోంది. పలువురు నేతలు

మిగతా 2వ పేజీలో...



# అక్రమ షెడ్ @ 25 లక్షలు ?

- అనుమతులు నిల్.. పైసల్ ఫుల్ !
- భారీగా ముడుపులందుకొని అనధికార అనుమతులని ప్రచారం
- స్థానిక నేతలతో కలిసి మున్సిపాలిటీ ఖజానాకు గండి కొడుతున్న అధికారులంటూ విమర్శలు
- ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలకు తావు !
- నిర్మాణాలు పూర్తి కావడమే అధికారుల అవినీతికి నిదర్శనమంటూ ఆరోపణలు

4లో



# అభివృద్ధికి అండగా ఉంటా

**ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు**
పార్టీలకు అతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని, అభివృద్ధికి అండగా నిలబడతానని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని, ఆ దిశగా కౌన్సిల్ సభ్యులు, అధికారులు కృషి చేయాలని కోరారు. ఎలాంటి కట్టుబాట్లకు లోబడకుండా అధికారులు తమ పని తాము చేసుకునే స్వేచ్ఛ కల్పిస్తామని తెలిపారు. ప్రధానంగా మున్సిపాలిటీ పరిధిలో సానిటరీ వ్యవస్థ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రవీందర్ దత్తు, వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, కమిషనర్ రవీందర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# తెలంగాణభవన్‌లో పీవీ వర్ధంతి

**నివాళులర్పించిన డిప్యూటీ సీఎం భట్టి**

**న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు :**
శనివారం నాడు న్యూఢిల్లీ లోని తెలంగాణ భవన్లో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు 19వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది.. తెలంగాణ భవన్ లోని అంబేద్కర్ ఆడిటోరియంలో రెసిడెంట్ కమిషనర్ డా.గౌరవ్ ఉప్పల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిధిగా హాజరయ్యి పి.వి నరసింహారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ " పీవీ నరసింహారావు భారత దేశ ప్రధానిగా, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టారని అలాంటి పీవీ తెలంగాణలో పుట్టడం గర్వంగా భావిస్తున్నానన్నారు. చిన్న నాటి నుంచే పీవీకి దేశం అంటే చాలా ప్రేమ అని అదే విధంగా ఆయనకు అనేక భాషలపై మంచి పట్టుందని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా భూసంస్కరణల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకున్న మహానుభావుడు పీవీ నరసింహారావు అని అన్నారు. పీవీ నరసింహారావు ఎన్నో గొప్ప సాహస నిర్ణయాలు తీసుకున్నారు అని తెలిపారు. పీవీ పాలనా దక్షత ఇతర రాష్ట్రాలకు ఉదాహరణగా నిలిచిందని,ఆయన పాలనా అనుభవం అందరికీ స్ఫూర్తిదాయకమని, దేశం ఆర్థికంగా, రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానిగా పీవీ కీలక భూమిక పోషించారన్నారు. అదే విధంగా పీవీ పాలనా దక్షత అనితర సాధ్యం అని ఆయన చెప్పారు. పీవీ ఆలోచనలను, మార్గాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు భవిష్యత్ తరాలు నడుం బిగించడమే, మనం ఆయనకిచ్చే నిజమైన నివాళి అని" అన్నారు.

## ఫార్మసీ సంస్థపై డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడి

**ఖమ్మం, ప్రభాతసూర్యుడు :**
ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని నరసింహారావుపేట సమీపంలోని యాస్మిన్ బయో ఫార్మసీపై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నడుస్తున్న యాస్మిన్ బయో ఫార్మసీపై ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. డిప్యూటీ డైరెక్టర్ రాజవర్ధన చారి,అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్‌తో పాటు తనిఖీల్లో పాల్గొన్న ముగ్గురు డ్రగ్ ఇన్స్పెక్టర్లు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. 28 బ్యాగులలో నిలువ ఉంచిన 9 క్వింటాల 35 కిలోల మెటీరియల్‌ను సీజ్ చేసారు. తల్లాడ పోలీస్ స్టేషన్లో అధికారులు ఫిర్యాదు చేశారు.




## పీవీకి పలువురు నివాళి

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :
మాజీ ప్రధాని పివి నరసింహరావు వర్దంతి నేపథ్యంలో శనివారం నాడు పివిఆర్ మార్గ్‌లోని పివిఆర్ జ్ఞానభూమి లో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్ రాజన్ నివాళు లర్పించారు.

# ఆపరేషన్ కంట్రోల్!

మొదటిపేజీ తరువాయి..



పొందేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు అనేక మంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో రేషన్ కార్డుల సంఖ్య అధికంగా ఉందన్న చర్చ ఉంది. దీంతో రేషన్ కార్డును కేవలం రేషన్‌కు మాత్రమే పరిమితం చేయాలన్న ఆలోచన కూడా ప్రభుత్వ వర్గాల్లో ఉంది. తద్వారా ప్రభుత్వం రాయితీపై రేషన్ దుకాణాల ద్వారా అందించే సరుకులను అర్హులకు మాత్రమే అందించే అవకాశం ఉంటుందన్న చర్చ సాగుతోంది. మరో వారం రోజుల్లో రేషన్ కార్డు తీసుకోవడానికి నిబంధనలపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# మనమే ఎక్కువ



మొదటిపేజీ తరువాయి..

5.93 లీటర్లు కాగా, బీర్ల వినియోగం 2.63 లీటర్లు. తెలంగాణ విషయానికి వస్తే.. ఇక్కడ తలసరి మద్యం వినియోగం 9 లీటర్లుగా, బీర్ల వినియోగం 10.7 లీటర్లుగా ఉంది. లిక్కర్ వినియోగంలోనే కాదు, ఆదాయంలోనూ రాష్ట్రం టాప్‌లో ఉంది. 2022-23లో తెలంగాణలో రూ.33,268 కోట్ల ఆదాయం వస్తే, ఏపీలో రూ.23,804 కోట్లు, కర్ణాటకలో రూ.29,790 కోట్లు, కేరళలో రూ.16,189 కోట్ల ఆదాయం మద్యం అమ్మకాల ద్వారా సమకూరింది. తెలంగాణలో ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న మద్యం వినియోగాన్ని నియంత్రించాలని భావిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకాలను నియంత్రించాలని నిర్ణయించింది. బెల్టుషాపులను పూర్తిగా ఎత్తివేసేందుకు ఆదేశాలు జారీచేసింది. అలాగే, బార్లు, వైన్‌షాప్‌లపైనా నియంత్రణ విధించాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది.



## సమ్మక్క జాతరకు జాతీయ హోదా కల్పించండి..

- **రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంత్రి సీతక్క వినతి**
- **సీతక్కకు చీర బహూకరించిన రాష్ట్రపతి**

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు ::** మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క కోరారు. ఈ మేరకు సీతక్క శనివారం రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. మేడారం జాతర విశిష్టతను వివరించారు. సమ్మక్క, సారలమ్మ పోరాట స్ఫూర్తిని రాష్ట్రపతికి తెలిపారు. జాతరకు జాతీయ స్థాయి గుర్తింపు వచ్చేలా చూడాలని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి తెలంగాణ రాష్ట్ర, ములుగు జిల్లా, తాడ్వాయి మండలం, మేడారం గ్రామంలో జరుగు సమ్మక్క - సారలమ్మ తల్లుల గిరిజన జాతర ఆసియా ఖండంలోనే జరిగే అతిపెద్ద గిరిజన జాతర అని, జాతరకు దేశం నలుమూలల నుండి కోటిన్నరకు పైగా భక్తులు వచ్చి దర్శనం చేసుకుంటారని, అలాంటి గిరిజన జాతరకు జాతీయ హోదా కల్పించాలని విన్నవించారు. అలాగే సమ్మక్క - సారలమ్మ తల్లుల ప్రతిమను అందించడం జరిగింది అని అన్నారు. కరోనా సమయంలో సీతక్క గారి సేవలకు గుర్తుగా రాష్ట్రపతి గారు సీతక్క గారికి చీరను బహుకరించారు. సీతక్క సేవల గురించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందిస్తూ సేవకురాలిగా ఎన్నో సేవలు చేసిన సీతక్కకు చీరను బహుకరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ పాల్గొన్నారు.

# కారు లేని కార్మిక పోరు!

మొదటిపేజీ తరువాయి..

టీబీజీకేఎస్ నాయకత్వం అంత కూడా ఇప్పుడు కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఐఎన్టీయూసీలో చేరటానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర రాజధానిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచర గణంతో చర్చలు జరుపుతుంది. ఇక, టీబీజీకేఎస్‌కు సంబంధించిన నాయకత్వం అంత కూడా ఇప్పుడు హైదరాబాద్‌లో ఉంది. అయితే టీబీజీకేస్ నాయకత్వం మొత్తం గతంలో కాంగ్రెస్ అనుబంధం ఐఎన్టీయుసీలో ఉన్నవారే.. వారంతా టీబీజీకేఎస్‌లో చేరి ఆ సంఘాన్ని బలోపేతం చేశారు. రెండుసార్లు గుర్తింపు సంఘంగా గెలుపొందడంలో కీలకపాత్ర పోషించారు. ఇప్పుడు టీబీజీకేఎస్ గుర్తింపు ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయం చేసుకోవడంతో ఆ సంస్థ నాయకత్వానికి రాజీనామా చేసిన ఆ సంఘం నాయకులు వెంకట్రావు, రాజిరెడ్డి, మల్లయ్యలు కాంగ్రెస్‌లో చేరటానికి రెడీ అయ్యారు. కొత్తగూడెంకు సంబంధించిన పలువురు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో సమావేశమయ్యారు. వీరందరూ కూడా పొంగులేటి సహకారంతో ఐఎన్టీయూసీలో చేరటానికి ప్లాన్ చేసుకుంటున్నారు. అయితే, టీబీజికేఎస్‌కు సంబంధించిన అగ్రనాయకత్వం అంతా ఐఎన్‌టీయూసీలో చేరటానికి సిద్ధం అవుతుండగా సీపీఐ అనుబంధ సంస్థ ఏఐటీయూసీ మాత్రం మైన్స్ మీద దృష్టి సారించింది. అసలైన ఓటర్లు ఎక్కడున్నారో వారి దగ్గరికి వెళ్లి అక్కడ టీబీజీకేఎస్‌కు సంబంధించిన కిందిస్థాయి నాయకత్వంపై దృష్టి సారించింది. కింద క్యాడర్ నాయకత్వాన్ని తమ సంస్థలో చేర్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

## తోటివారికి ఇబ్బంది కలిగించొద్దు

**మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ విజ్ఞప్తి**

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**



ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో తక్కువ దూరం ప్రయాణించే మహిళలు ఎక్కువగా వెళుతున్నట్లు టీఎస్ ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి వచ్చింది. దీనివల్ల దూర ప్రాంత ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. తక్కువ దూరం ప్రయాణించే వారు పల్లెవెలుగు బస్సుల్లో ఎక్కి.. సిబ్బందికి సహకరించాలని కోరుతున్నాం. అలాగే, కొందరు మహిళలు అనుమతించిన స్టేజీల్లో కాకుండా మధ్యలోనే బస్సులను ఆపమని సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ప్రయాణ సమయం పెరుగుతోంది. ఇక నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సులను అనుమతించిన స్టేజీల్లోనే ఆపడం జరుగుతుంది. దూర ప్రాంత ప్రయాణికులకు ప్రాధాన్యత ఇచ్చి సిబ్బందికి సహకరించాలని టీఎస్‌ఆర్టీసీ ఎండీ విసి సజ్జనార్ విజ్ఞప్తి చేసారు.

# నమోస్తుతే..!



మొదటిపేజీ తరువాయి..

మాట్లాడే రాష్ట్రాలైన రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో బీజేపీ పెద్ద విజయం సాధించింది. తెలంగాణలో కాంగ్రెస్‌కు అధికారం దక్కింది. వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఆ ఎన్నికలను సెమీ ఫైనల్స్‌గా భావించారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలో, లోక్‌సభ ఎన్నికల తేదీలు ప్రకటించకముందే భారతీయ జనతా పార్టీ తన అభ్యర్థులను ప్రకటించడం ప్రారంభిస్తుంది. జనవరి చివరి వారంలో మొదటి జాబితా వచ్చే అవకాశం ఉందని వర్గాలు చెబుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి 22న రామ్‌లల్లా దీక్ష తర్వాత బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాను విడుదలచేయనున్నట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ నేతృత్వంలో సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ రెండుసార్లు సొంతంగా మెజారిటీ సాధించింది. 2014లో ఆ పార్టీ 'అచ్చే దిన్ ఆనే వాలే హై' అనే నినాదాన్ని ఇచ్చింది.కాగా 2019లో మరోసారి మోదీ ప్రభుత్వం అంటూ బీజేపీ నినాదాలు చేసింది. బీజేపీ కొత్త నినాదాలతో జనంలోకి వెళ్లాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 'కలలు కావు వాస్తవం, అందుకే ఈసారి హ్యాట్రిక్ విజయం సాధిస్తుందనే ఆశతో అందరూ మోదీని ఎంచుకుంటున్నారు' అనే నినాదంతో ప్రచారంలో వెళ్ళాలని భావిస్తోంది. ప్రజలు తనను మళ్లీ ఎన్నుకుంటారని ప్రధాని నరేంద్ర మోదీ కూడా చాలాసందర్భాలలో ధీమా వ్యక్తం చేశారు.ఇక ఢిల్లీలో రెండు రోజుల పాటు బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించనున్నారు. ఇందులో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, రాష్ట్ర ఇన్‌చార్జ్, కో-ఇన్‌చార్జ్, రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాజరుకానున్నారు. ఈ సమావేశానికి బీజేపీ అన్ని పార్టీ విభాగాల జాతీయ అధ్యక్షులు కూడా హాజరుకానున్నారు. ఈసమావేశంలో పలు అంశాలపై సమీక్షించనున్నారు. వికాస్ భారత్ సంకల్ప్ అభియాన్, రాబోయే లోక్‌సభ ఎన్నికల సన్నాహాలకు సంబంధించి సమీక్ష నిర్వహించనున్నారు. ఎన్నికైన ప్రతినిధుల శిక్షణ,విస్తరణ ప్రణాళిక, కాల్ సెంటర్, మోర్చా కార్యకలాపాలపై కూడా సమావేశంలో చర్చ జరుగుతుంది. వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల వరకు మూడు రాష్ట్రాల్లో బంపర్ విజయం సాధించినఉత్సాహాన్ని ఆ పార్టీ కొనసాగించాలన్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా రామ మందిరానికి సంబంధించిన కార్యక్రమాలతో పాటు పలు కార్యక్రమాలను నిర్వహించి, కార్యకర్తలను రంగంలోకి దింపాలని బీజేపీభావిస్తోంది.

# ఛలో ఢిల్లీ!



మొదటిపేజీ తరువాయి..


పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ప్రకటించుకుని ప్రచారంలో దూసుకుపోతున్నారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఇప్పుడు అన్ని పార్టీలు పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి పెట్టాయి. ఏ నియోజకవర్గానికి ఎవరు అభ్యర్థి అయితే బాగుంటుంది అనే దానిపై ప్రధాన పార్టీలు కసరత్తు కూడా చేస్తున్నాయి.. ఈ క్రమంలోనే భారతీయ జనతా పార్టీ కూడా అభ్యర్థుల విషయంలో దృష్టి పెట్టినట్టు సమాచారం. అయితే కొందరు పార్టీ నేతలు పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సమాయత్తమవుతుండటం పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వారు సైతం పార్లమెంట్ బరిలో దిగేందుకు సై అంటున్నారని పార్టీ వర్గాలు అనుకుంటున్నాయి. ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన సిట్టింగ్ ఎంపీలు మరోసారి తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటు స్థానాలు నుండి పోటీ చేసే అవకాశం ఉంది. అయితే ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంలో ప్రస్తుత ఎంపీ పోటీ చేస్తారా లేదా అనే సందేహం వ్యక్తం అవుతుంది. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబూరావు తనకు ఆ టికెట్ ఇస్తారని హామీ ఇచ్చారని చెప్పుకుంటున్నారు. ఇక ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఈటెల రాజేందర్, రఘునందన్ రావు, సుభాష్ రెడ్డి, కొండేటి శ్రీధర్, హుస్సేన్ నాయక్, ఆచారిలు సైతం ఎంపీలుగా పోటీ చేసేందుకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తోంది. పార్టీ అవకాశం ఇస్తే పోటీ చేస్తామని ఈటెల రాజేందర్, రఘునందన్ రావు ఇప్పటికే ప్రకటించారు కూడా. ఈటెల రాజేందర్ మల్కాజ్‌గిరి, మెదక్ స్థానాల్లో ఏదో ఒక చోట నుండి పోటీ చేసే అవకాశం ఉంది. ఆయన ఎక్కడ నుండి పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఇక మెదక్ నుండి రఘునందన్ రావు గతంలో పోటీ చేశారు. ఇప్పుడు కూడా పోటీ కి రెఢీ అంటున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుండి, ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసిన సుభాష్ రెడ్డి మరోసారి పోటీ చేయాలని అనుకుంటున్నారట. ఇక, వరంగల్ పార్లమెంట్ స్థానం నుండి వర్ధన్నపేట అసెంబ్లీకి పోటీ చేసిన కొండేటి శ్రీధర్ ఆశిస్తున్నారట. మహబూబాబాద్ పార్లమెంటు నుండి పోటీ చేసేందుకు మహబూబాబాద్ అసెంబ్లీకి పోటీ చేసిన హుస్సేన్ నాయక్ సిద్ధంగా ఉన్నారట. పెద్దపల్లి నుండి మరోసారి తనకు అవకాశం రావచ్చు అని ధర్మపురి అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసిన ఎస్ కుమార్ భావిస్తున్నారట. మల్కాజిగిరి లోక్ సభ స్థానం నుండి పోటీ చేసేందుకు ఆ పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీల నుండి పోటీ చేసిన ఒకరిద్దరు కన్నేశారని కూడా పార్టీలో ప్రచారం జరుగుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజారిటీ ఓటమి చవిచూసిన తల్లోజు ఆచారి కూడా తాను సైతం ఎంపీ బరిలో అంటున్నారట. మొత్తానికి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన పలువురు నేతలు, పార్లమెంట్ బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని అనుకుంటున్నారట. మరి పార్టీ హై కమాండ్ ఎవరిని కరుణిస్తుందో.. ఎవరికి మొండి చెయ్యి చూపుతుందో వేచి చూడాల్సిందే..!



# పీవీ గొప్ప మేధావి

- **కొనయాడిన సీఎం రేవంత్**
- **మాజీ ప్రధానికి ఘన నివాళి**

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** దివంగత మాజీ ప్రధాని పీవి నరసింహారావు దేశ కీర్తిని ప్రపంచానికి చాటిన మేధావని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. శనివారం నాడు అయన పీవీ నరసింహారావు 19వ వర్ధంతి సందర్భంగానివాళులు అర్పించార.తరువాత రేవంత్ మాట్లాడుతూ పరిపాలనలో సమూల మార్పులు తెచ్చి ఆదర్శంగా నిలిచిన వ్యక్తి పీవీ దేశ ఆర్థిక వ్యవస్థ ప్రశ్నార్ధకంగా మారినప్పుడు సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. బంగారాన్నికుదవ పెట్టి అప్పులు తేవడంపై ఆయన ఒకే మాట చెప్పారు. తెలివైన వాడు సగం ఆస్తిని కుదవపెట్టి అయినా సరే మిగతా ఆస్తిని కాపాడుకుంటారని ఆయన చెప్పారు. భూమిని పేదవాడికి అందుబాటులోకితీసుకొచ్చిన వ్యక్తి పీవీ. పేదలకు భూములు పంచడానికి పీవీ బలమైన పునాదులు వేశారు. పీవీ మన మధ్య లేకపోయినా వారి సంస్కరణలు సదా ఆచరణీయం. పీవీ ఘాట్, జైపాల్ రెడ్డి ఘాట్ లనుఅభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. వీరిద్దరూ తెలంగాణకు లంకె బిందెల్లాంటి వారు. పీవీ కీర్తిని పెంచేలా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.



# ఉత్తర దిక్కు.. వైకుంఠ మొక్కు

- **ఆలయాలకు పోటెత్తిన భక్తులు**
- **ఉత్తర ద్వారం ద్వారా ఆలయ ప్రవేశం**
- **తెలంగాణలో ముక్కోటి ఏకాదశి వైభవం**

**భద్రాచలం, ప్రభాతసూర్యుడు :** ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాద్రిలో ఉత్తర ద్వారం నుండి వైకుంఠ రాముడిగా స్వామివారు దర్శనమిచ్చారు. జే గంటల సవ్వడులు, ధూపపు పొగల నడుమ తెల్లవారుజామున ఐదుగంటల నుండి ఆరు గంటల వరకు గరుఢ వాహనంపై సాక్షాత్తు వైకుంఠ రాముడిగా భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహనంపై సీతాదేవి రాజాధిరాజా గజ వాహనంపై, లక్ష్మణస్వామి, హనుమ వాహనంపై వారితోపాటు గోదాదేవి, నమ్మాల్వార్లు, రామానుజ స్వామివార్లు ఇతర వాహనాల్లో కొలువు తీరారు. నయనానందకరంగా సాగిన ఈ అపూర్వ ఘట్టాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

**వేములవాడలో**

రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. సుప్రభాత సేవ అనంతరం స్వామి వారికి ప్రాతఃకాల పూజ నిర్వహించిన ఆలయ అర్చకులు ఉ త్సవమూర్తులను పల్లకి సేవలో ప్రతిష్టిం చిన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. తదుపరి రంగు రంగుల పూలతో అలంకరించిన అం బారి సేవపై శ్రీపార్వతి రాజరాజేశ్వర స్వామి, శ్రీలక్ష్మి అనంత పద్మనాభస్వామి ఉత్సవ మూర్తులను ప్రతిష్టించి దేవాల యంలో మూడు ప్రదక్షిణలు చేసిన అనం తరం రాజగోపురం గుండా స్వామి వారు బయటకు రాగానే వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. కార్య క్ర మంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ శర్మ, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రతాపరామ కృష్ణతోపాటు భక్తులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం రింగ్ మాస్టర్‌లో టెన్షన్

**కరీంనగర్, ప్రభాతసూర్యుడు :** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి ఒక్కొక్కటిగా జరుగుతున్న పరిణామాలు, ఈ ప్రా-జెక్టుకు సంబంధించి కీలక పాత్ర పోషించిన రింగ్ మాస్టర్ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎంతో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ.. దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జి.నిరంజన్ తాజాగా హైకోర్టులో దాఖలు చేసిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంతో ఈ వ్యవహారం ఎక్కడిదాకా వెళ్తుందోనని రింగ్‌మాస్టర్‌లో ఆందోళన మొదలైంది.కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ ఎత్తున అవినీతి జరిగిందని ఇటు కాంగ్రెస్ పార్టీ, అటు బీజేపీ పార్టీకి చెందిన కేంద్రస్థాయి అగ్రనేతలతో పాటు, రాష్ట్ర స్థాయి నాయకులు కొంతకాలంగా భారీ ఎత్తున ఆరోపణలు చేస్తున్నారు. దాదాపు 1.25 లక్షల కోట్ల రూపాయల వ్యయ అంచనాతో భారీ స్థాయిలో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం, ఇప్పటిదాకా దాదాపు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు అంచనా.ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన పెట్టుబడిలో భాగంగా, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్, నాబార్డ్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి ఆర్థిక సంస్థలు దాదాపు 86 వేల కోట్ల రూపాయల రుణం మంజూరు చేసి, ఇందులో అత్యధిక భాగం విడుదల చేశాయి. ప్రాజెక్టు పనులు చాలా వరకు పూర్తవడంతో, ఆ డబ్బులు కూడా కాంట్రాక్టర్లకు చెల్లించారు.కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలు ఆరోపణలు చేసినట్లు, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగి ఉంటే.. దీని మూలంగా నష్టపోయింది ప్రభుత్వ ధనం, ప్రజాధనం మాత్రమే. ఈ అప్పులు తీర్చాల్సిన బాధ్యత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మీదే ఉంది. దీంతో, ఈ ప్రాజెక్టుకు సంబంధించి అటు డిజైనింగ్‌లో, ఇటు ఈ ప్రాజెక్టును వివిధ ప్యాకేజీలుగా విభజించడంలో, అంతిమంగా నిర్మాణ కాంట్రాక్టుల్లో సింహభాగం పొందడంలో రింగ్‌మాస్టర్ పోషించిన పాత్రపై సహజంగానే అందరి దృష్టి పడింది.సిబిఐ విచారణ జరిపించాలని



తెలంగాణ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై తదుపరి విచారణను రెండు వారాల పాటు వాయిదా వేయడంతో పాటు, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. మరోవైపు, ఈ ప్రాజెక్టుపై అసెంబ్లీలోనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడంతో, ఏఏ లొసుగులు బయటకు రానున్నాయనే ఆందోళన కొందరిలో మొదలైంది.

**ఈ ప్రాజెక్టుకు సంబంధించి మొదటి నుంచి కొన్ని అనుమానాలు ఉన్నాయి. అవి ఏంటంటే..**

- ప్రాజెక్టు డిజైన్‌లో ఇంజనీరింగ్ పరంగా కీలక పాత్ర పోషించింది ఎవరు?
- ఈ ప్రాజెక్టు టెండర్ల నిబంధనలను రూపొందించడంలో, ప్రాజెక్టును వివిధ ప్యాకేజీలుగా విభజించడంలో కీలక పాత్ర పోషించింది ఎవరు?
- ఈ ప్రాజెక్టు కాంట్రాక్టుల్లో సింహభాగం దక్కించుకున్నది ఎవరు ?
- ఇరిగేషన్ శాఖ అధికారులు కొందరితో కుమ్మక్కై.. వారికి వ్యక్తిగత ప్రయోజనాలు చేకూర్చారనే ఆరోప ణలు బయటపడటంతో, ఉలిక్కిపడింది ఎవరు ?
- అంతిమంగా.. ఈ ప్రాజెక్టులో నిజంగా అవినీతి జరిగిందా? ఒకవేళ.. ఈ విషయమై పూర్తిస్థాయి విచారణ జరిగితే.. ఈ మొత్తం వ్యవహారంలో రింగ్‌మాస్టర్ పాత్ర ఏంటనేది, ఈ రింగ్‌మాస్టర్ ఏ స్థాయిలో ప్రయోజనం పొందారన్నది బయటకు రానుంది.తాజా పరిణామాలతో తీవ్ర ఆందోళన చెందుతున్న రింగ్‌మాస్టర్.. వ్యవహారం తమ చేయిదాటి, అంతిమంగా తమ మెడకు చుట్టుకుంటుందేమోనన్న భయంతో ఉన్నారు. వివిధ స్థాయిల్లో తమకున్న పరిచయాలను, పలుకుబడిని ఉ పయోగించి.. ఏదోలా దీన్నుంచి బయటపడే మార్గాలపై రింగ్ మాస్టర్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

రాజకీయంగా అత్యంత సునిశితంగా, ప్రధానంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆరోపణలకు సంబంధించి, ముున్ముందు జరుగనున్న పరిణామాలపై ఎంతో ఆసక్తి నెలకొంది. సీబీఐ విచారణతోపాటు, సీరియస్ ఫ్రాడ్స్ ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్ ద్వారా కూడా ఆర్థిక అవకతవకలపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ నేత నిరంజన్ తన పిటిషన్‌లో పేర్కొనడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

# ప్రజాపాలనకు రేవంత్ శ్రీకారం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణ ప్రభుత్వం మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే 'ప్రజా వాణి' పేరుతో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తుండగా, పరిపాలనను గ్రామ-స్థాయిలోకి తీసుకెళ్లి, అక్కడే సమస్యలకు పరిష్కారం చూపేందుకు సిద్ధమైంది. ప్రజాపాలన పేరుతో ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు, పది రోజుల పాటు ప్రజాపాలన పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టబోతున్నారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక యంత్రాంగం, గ్రామస్థాయిలో సదస్సులు నిర్వహించి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోనుంది. వాటిని అక్కడికక్కడే పరిష్కరించేలా కసరత్తు చేస్తోంది. ఆదివారం కలెక్టర్లతో జరిగే సమాశంలో ప్రజాపాలనపై సీఎం రేవంత్ రెడ్డి చర్చించనున్నారు. గ్రామ స్థాయిలో విద్య, వైద్యం, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లా అధికారులు గ్రామాలకు వెళ్లి నేరుగా ప్రజలతో మాట్లాడనున్నారు. తొలుత పది రోజుల పాటు గ్రామస్థాయిలో ప్రజాపాలన నిర్వహించనుంది. ఆ తర్వాత అవ-సరమైతే మరోసారి నిర్వహించడంపై ఆలోచన చేస్తోంది. ఆరు గ్యారెంటీల లబ్ధిదారుల ఎంపికకు ఈ నెల 28 నుంచి దరఖాస్తుల స్వీకరించాలని నిర్ణయించింది. రూ.500కు గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ.2,500 నగదు బదిలీ, పెన్షన్ల పెంపు, ఇంటి నిర్మాణానికి 5 లక్షల నగదుసాయం, కొత్త రేషన్ కార్డుల జారీ కోసం దరఖాస్తులు స్వీకరించనుంది. తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రత్యేకతను చాటుకుంటున్నారు. సమీక్షలు, సమావేశాలతో బిజీగా ఉంటూనే, ఆరు గ్యారెంటీల అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజా పాలన అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. రోజురోజుకో సరికొత్త కార్యక్రమాల్లో పాలన సాగిస్తూ.. ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేసే క్రమంలో ప్రతి మంగళవారం, శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 'ప్రజా వాణి' నిర్వహిస్తున్నారు. ప్రజా భవన్ లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తొలి రోజు నుంచే విశేష స్పందన లభిస్తోంది. భూసమస్యలు, రెండు పడక గదుల ఇళ్లు మంజూరు, నిర్మాణం, వివిధ రకాల పింఛన్లకు సంబంధించిన వినతులే ఎక్కువగా వస్తున్నాయి. మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యల కోసం ప్రజలు వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్ ప్రజా భవన్ కు వస్తున్నారు. దీంతో ఈ



కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అందుకు అనుగుణంగా 'ప్రజా పాలన'కు శ్రీకారం చుట్టారు.సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 24న అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించనున్నారు. ప్రజావాణిలో వస్తున్న దరఖాస్తులు, భూ రికార్డులతో ముడిపడిన సమస్యలు, కౌలు రైతుల గుర్తింపు, కొత్త రేషన్ కార్డుల జారీ, మహాలక్ష్మి తదితర పథకాల అమలుపై వారితో చర్చించనున్నారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలపై తగిన సమాచారంతో సమీక్షకు హాజరు కావాల్సిందిగా శు క్రవారం కలెక్టర్లకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి.

# కాకతీయ వర్శిటీలో ర్యాగింగ్ కలకలం

**వరంగల్, ప్రభాతసూర్యుడు :** యూనివర్శిటీలు, కాలేజీల్లో ర్యాంగింగ్ నియంత్రణకు అనేక చర్యలు తీసుకుంటున్నా కొందరు విద్యార్థులు మాత్రం మారడం లేదు. కొత్తగా చేరిన జూనియర్లను సీనియర్లు వేధించడం పరిపాటిగా మారిపోయింది. ర్యాంగింగ్ కు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నప్పటికీ, సీనియర్లు పట్టించుకోవడం లేదు. జూనియర్లను ర్యాగింగ్ పేరుతో ఏడిపిస్తున్నారు. వరంగల్ లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో సీనియర్లు రెచ్చిపోయారు. నూతన పరిచయం పేరుతో జూనియర్లను వేధించారు. ర్యాగింగ్ చేసిన 81 సీనియర్లపై హాస్టల్ వార్డెన్, కళాశాల ప్రిన్సిపల్ చర్యలు తీసుకున్నారు. 81 మందిని వారంరోజుల పాటు హాస్టల్ నుంచి బహిష్కరించారు. కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్రలో ర్యాగింగ్ కు పాల్పడిన విద్యార్థులందరి హాస్టల్ నుంచి సస్పెండ్ చేయడం తొలిసారి. ర్యాగింగ్ చేసిన విద్యార్థినులందరూ కామర్స్, ఎకనామిక్స్, జువాలజీ విభాగాలకు చెందిన వారే. కొత్తగా చేరిన వారిని పరిచయ క్లాసుల పేరుతో సీనియర్లు వేధింపులకు గురి చేశారు. ఇది కాస్త పెచ్చుమీరడంతో కొందరు బాధితులకు హాస్టల్ వార్డెన్, కళాశాల ప్రిన్సిపల్ కు ఫిర్యాదు చేశారు. పరిచయాల పేరుతో ర్యాగింగ్‌కు పాల్పడుతున్న పీజీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల వివరాలు ఆరా తీశారు. క్యాంపస్‌లోని హాస్టల్ వార్డెన్, కళాశాల ప్రిన్సిపల్, ఇతర అధికారులు...ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థుల వారి వివరాలు సేకరించారు. క్యాంపస్ లోని అన్ని విభాగాల్లోని సీనియర్లు, జూనియర్లను వేధిస్తున్నట్లు తేలింది. దీంతో ర్యాగింగ్ చేసిన 81 మంది విద్యార్థులను సస్పెండ్ చేశారు యూనివర్శిటీ అధికారులు.వేటు పడ్డ విద్యార్థినులందరూ కామర్స్, ఎకనామిక్స్, జువాలజీ విభాగాలకు చెందిన వారే క్యాంపస్ లోని హాస్టల్స్ కు ఇవాళ్టి నుంచి క్రిస్మస్ సెలవులు ప్రకటించారు. విద్యార్థులందరూ వెంటనే ఇళ్లకు వెళ్లిపోవాలని హాస్టల్ వార్డెన్ సూచించారు. క్యాంపస్ లో ఎవరు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ పాల్పడిన కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు. ఏ యే విభాగాలు, హాస్టళ్లలో ర్యాగింగ్ చేస్తున్నారో వివరాలు సేకరిస్తున్నారు అధికారులు. సరైన ఆధారాలు లభిస్తే వారినీ సస్పెండ్ చేస్తామని, ఎవర్నీ వదిలిపెట్టేది లేదంటున్నారు. ఒకేసారి ఇంత పెద్దమె-ంత్తంలో యువతులపై సస్పెన్షన్ వేటు పడటం యూనివర్శిటీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటి వరకూ ర్యాగింగ్ విషయాల్లో అబ్బాయిలు ఉండే వారు. కానీ, ఇప్పుడు ర్యాగింగ్‌కు పాల్పడిన వారిలో అమ్మాయిల పేర్లు రావడం చర్చనీయాంశంగా మారింది. కేయూలో విద్యార్థినులకు వసతి కల్పించడం కోసం ఐదు హాస్టల్స్ ఏర్పాటు చేశారు. పద్మాక్షి ఏ, బీ, సీ, డీ, ఈ అనే బ్లాక్ లు విద్యార్థినుల కోసం కేటాయించారు. వాటిల్లో రెగులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు సంబంధించిన దాదాపు 1,800 మంది విద్యార్థినులు హస్టల్ లో ఉంటున్నారు. గత ఏడాది ఫిబ్రవరి నెలలో వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ దుమారం రేపింది. సీనియర్ల వేధింపుల వల్ల డాక్టర్ ప్రీతి సూసైడ్ చేసుకుంది. ఆ తర్వాత వేధింపులకు పాల్పడిన నిందితుడు సైఫ్ ను పోలీసులు అరెస్ట్ చేసి చర్యలు తీసుకున్నారు. ఈ వ్యవహారం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.





నిర్మాణదశలో ఉన్న షెడ్డు

పూర్తిస్థాయికి చేరుకున్న షెడ్డు నిర్మాణం

# అక్రమ షెడ్ @ 25లక్షలు?

- అనుమతులు నిల్.. పైసల్ ఫుల్ !
- భారీగా ముడుపులందుకొని అనధికార అనుమతులని ప్రచారం
- స్థానిక నేతలతో కలిసి మున్సిపాలిటీ ఖజానాకు గండి కొడుతున్న అధికారులంటూ విమర్శలు
- ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలకు తావు !
- నిర్మాణాలు పూర్తి కావడమే అధికారుల అవినీతికి నిదర్శనమంటూ ఆరోపణలు


ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
20 Dec 2023 - Page 3

ప్రభువా..
## నిబంధనలకు సిలువ!

- చర్చీ ముసుగులో అక్రమంగా నిర్మాణం
- ప్రభుత్వ అనుమతులు లేకుండానే భారీ షెడ్
- 12 అడుగుల లోతు సెల్లార్ తవ్వకాలు
- ఎన్నికల కోడ్ అదునుగా యధేచ్ఛగా నిర్మాణం
- స్థానిక నేతల అండదండలున్నాయనే ఆరోపణలు
- లక్షల్లో ముడుపులు ముట్టినట్లు ప్రచారం
- ఫిర్యాదులున్నా పట్టించుకోని అధికారులు
- కనీసం కన్నెత్తిచూడని టౌన్ ప్లానింగ్ విభాగం

**అబ్దుల్లాపూర్‌మెట్ - ప్రభాత సూర్యుడు :** అసెంబ్లీ ఎన్నికల కోడ్‌ను అదునుగా చూసుకొని పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణదారులు రెచ్చిపోతున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే భారీ షెడ్లను, వ్యాపార సముదాయాలను నిర్మిస్తున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లా, పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి 6వ వార్డులో భారీ అక్రమ నిర్మాణం చేపట్టారు. చర్చి ముసుగులో 12 అడుగులకు పైగా సెల్లార్ తవ్వకాలు జరిపి మరీ.. రెండు ఫ్లోర్ల భారీ షెడ్ నిర్మిస్తున్నా.. తీసుకోవడం లేదు. ఫిర్యాదులు అందుతున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇచ్చిన ఫిర్యాదులన్నీ బుట్ట దాఖలయ్యాయని, కండ్ల ముందే భారీ నిర్మాణాలు జరుగుతున్న కనీసం కన్నెత్తి చూడడం లేదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు.

**స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతోనే అక్రమ నిర్మాణాలు**

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ నిర్మాణాలన్నీ స్థానిక కౌన్సిలర్ల అండదండలతోనే జరుగుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. లక్షల రూపాయల ముడుపులు దండుకొని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ నిర్మాణాలు కంటపడితే చాలు డేగళ్ళ వాలిపోయి జేబులు నింపుకుంటారని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అందుకు తోడు మున్సిపల్ అధికారులు అక్రమార్కులకు అండగా నిలబడి చేతులు తడుపుకొని అటువైపు చూడడం లేదని, మరి అడిగితే నోటీసులు ఇచ్చామని, ఉన్నతాధికారులకు తెలిపామని చేతులు దులుపుకుంటున్నారు. దీంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడుతుందని ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా మున్సిపాలిటీ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని, మున్సిపాలిటీ

**డిటిఎఫ్ అధికారులకు తెలిపాం**

చర్చ్ పేరిట అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని సమాచారం ఉంది. ఫిర్యాదులు కూడా అందుతున్నాయి. సదరు నిర్మాణదారుడికి నోటీసులు ఇచ్చాము. అయినా యదేచ్ఛగా నిర్మాణాలు జరుపుతున్నారు. డిస్టిక్ టాస్క్ ఫోర్స్ (డిటిఎఫ్) అధికారులకు తెలిపాము. వారి నుంచి ఆదేశాలు వచ్చాక చర్యలు తీసుకుంటాం.

ఎస్.రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, పెద్ద అంబర్ పేట్

> **'కంచే చేను మేసిన చందంగా' ప్రభుత్వ ఖజానాను సమకూర్చ వలసిన అధికారులే ప్రజాప్రతినిధులతో చేతులు కలిపి మున్సిపాలిటీ ఆదాయానికి భారీ గండి కొడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పిర్యాదులు ఎన్ని అందినా.. బుట్టదాఖలు కావలసిందే తప్ప ఎలాంటి చర్యలు మాత్రం ఉండవు. ఇదంతా ఇక్కడో కాదు, రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ అధికారులు తీరు.**

**అబ్దుల్లాపూర్‌మెట్ - ప్రభాత సూర్యుడు**

పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి 6వ వార్డులో చర్చ్ మాటున భారీ అక్రమ నిర్మాణం జరుగుతున్న మున్సిపల్ అధికారులు కాసుల వేటలో పడి తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై కొద్ది రోజులుగా స్థానికులు ఎన్నిసార్లు పిర్యాదులు చేసినా కాలయాపన చేస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు లేవని స్థానికులు, పలువురు నాయకులు మొరపెట్టుకుంటున్నారు. ఇదే అంశంపై వార్త పత్రికల్లో కథనాలు ప్రచురిచమైన అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదు. ఈ పరిణామాలన్నీ పలు అనుమానాలకు తెరలేపుతున్నాయి. చర్చ్ నిర్మాణానికి స్థానిక నేతలతో కలిసి 25 లక్షల రూపాయల వరకు ముడుపులు చేతులు మారినట్లు పలువురు పిర్యాదు దారులు ఆరోపిస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో అక్రమ నిర్మాణం జరుగుతున్నా.. స్థానిక కౌన్సిలర్ గాని, పాలక వర్గం గాని నోరు మెదపకపోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుతుందన్న వాదనలో నిజం లేకపోలేదు.

**టాస్క్ ఫోర్స్ పేరుతో కాలయాపన**

ఎవరైనా అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేస్తే.. అధికారులు మొట్టమొదటిగా చెప్పే మాట, "చర్యలు తీసుకుంటామని లేదంటే అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చామని"దాటవేస్తారు. మరీ ఒత్తిడి చేస్తే డిటిఎఫ్ (డిస్టిక్ట్ టాస్క్ ఫోర్స్) అధికారులకు తెలిపామని.. వారి నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే కూల్చివేస్తామని అంటారు. కానీ డిటీఎఫ్ అధికారులు వచ్చేది లేదు, కూల్చేది లేదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు.

**పుణ్యకాలం పూర్తి**

నూతన మున్సిపాలిటీ చట్టం ప్రకారం అక్రమ కట్టడాలను అడ్డుకునే పూర్తి అధికారాలు మున్సిపాలిటీ అధికారులకు ఉన్నా కూడా.. తమ పరిధిలో లేనట్లు, డిటిఎఫ్ అధికారులపై నెట్టేసి చేతివాటం ప్రదర్శిస్తున్నారని స్థానికంగా విమర్శలు కురిపిస్తున్నారు. డిటిఎఫ్ అధికారులు వచ్చేది లేదు, సచ్చేది లేదు, ఈలోగా చకచకా నిర్మాణాలు పూర్తి చేసి పుణ్యకాలం ముగించేస్తున్నారు అక్రమార్కులు.

**ఎమ్మెల్యేను సైతం బద్నాం చేస్తూ..**

మరి లోతుగా వెళ్తే., వారు ఎమ్మెల్యే మనుషులని, ఎమ్మెల్యే నుండి ఫోన్ చేయించి చెప్పారని, ఎమ్మెల్యేలను సైతం బాదనం చేస్తూ కాసులు దండుకుంటున్నారు కొందరు. దీంతో మున్సిపాలిటీ ఖజానాకు భారీ గండి పడుతుంది. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయవలసిన అధికారులే కాసుల మత్తులో పడి ప్రభుత్వ ఖజానా గండికి కారకులవుతున్నారని తారా స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు ఇలాంటి వాటిపై ఇలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే మరి.





# బీటెక్ బురిడీలకు గుడ్ న్యూస్

- ఫెయిల్ స్టూడెంట్లకు జేఎన్టీయూ తీపికబురు
- క్రెడిట్ స్కోరును 75శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటన
- ఈ విద్యాసంవత్సరానికి మాత్రమే వెసులుబాటు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు పైచదువుల్లో రాణించలేకపోతున్నారు. దీంతొ ఇంజినీరింగ్‌లో చేరిన తొలి ఏడాదిలోనే ఫెయిలవుతున్నారు. ఇలా ప్రతీయేట ఇంజనీరింగ్‌లో వందల మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేక చతికిల పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన జేఎన్‌టీయూ హైదరాబాద్ అలాంటి విద్యార్థులను రెండో సంవత్సరానికి ప్రమోషన్ ఇచ్చేందుకు వీలుగా వినూత్న నిర్ణయం తీసుకుంది. మొదటి ఏడాది అకాడమిక్ క్రెడిట్స్‌ను 75 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు కూడా ఈ విద్యా సంవత్సరానికి క్రెడిట్స్ వ్యవస్థనే పూర్తిగా తొలగించింది. అయితే ఇలా క్రెడిట్స్‌ను తగ్గించి విద్యార్థులకు ప్రమోషన్ ఇస్తున్నా మిగిలిన సెమిస్టర్లలో వారికి ఒత్తిడి పెరిగిపోతుందని నిపుణులు అంటున్నారు. విభిన్న నేపథ్యాల నుంచి వస్తున్న విద్యార్థులకు అవకాశం కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఇంజనీరింగ్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగకపోవడంపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు. అందుకు పలు కారణాలు ఉన్నట్లు గుర్తించారు. అవేంటంటే..ఇంటర్మీడియట్ వరకు తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థుల్లో చాలామందికి ఒకేసారి ఇంగ్లీష్‌లో చదవాలంటే ఇబ్బంది కావడం అప్పటి వరకు గ్రామాల్లో చదువుకున్న విద్యార్థులు నగరాల పరిస్థితులకు అలవాటు పడలేకపోవడం ఉస్మానియా, జేఎన్‌టీయూ లలో సరైన సంఖ్యలో ప్రొఫెసర్లు, అధ్యాప కులు లేకపోవడం కొత్తగా వచ్చిన సైబర్ భద్రత, కృత్రిమమేధ, డేటాసైన్స్ వంటి కోర్సులపై కొందరు అధ్యాపకులకు పూర్తి స్థాయిలో అవగాహన కొరవడటంపై కార ణాలతో పాటు బోధనా ప్రమాణాలు తగ్గిపో వడం వల్ల ఫెయిలవుతున్న విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని నిపు ణులు అంటున్నారు. డిటెన్షన్ విధానంతో విద్యార్థుల్లో ఆత్మన్యూనత భావం కలుగు తోందని చెబుతున్నారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో క్రెడిట్స్ తగ్గింపు కేవలం ప్రస్తుత విద్యాసంవత్సరానికి మాత్రమేనని అంటు న్నారు. పాఠాలు అర్థం కావడంలేదని, ఫెయిలవుతున్నారని రెండో సంవత్సరానికి ప్రమోషన్ కోసం క్రెడిట్స్‌ను తగ్గించడం సరికాదని ఉస్మానియా మాజీ వీసీ ఎ.రామచంద్రం సూచిస్తున్నారు. బోధనా ప్రమాణాలు పెంచితేగానీ విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడవని అంటున్నారు.

# మంత్రివర్గ విస్తరణ కోసం ఎదురు చూపులు

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ కు ముహూర్తం ఖరారు అయిందా..పార్లిమెంట్ ఎన్నికల లోపే పూర్తి స్థాయి మంత్రివర్గ విస్తరణ ఉండబోతుందా..మంత్రి వర్గ విస్తరణ లో చోటు దక్కే నేతలు ఎవరు ?? ఓడిపోయిన నేతలకు క్యాబినెట్ లో అవకాశం కల్పిస్తారా?? గ్రేటర్ హైదరాబాద్ లో మంత్రి పదవి ఎవరికి దక్కనుంది??మంత్రి వర్గ కూర్పు పై తెలంగాణ కాంగ్రెస్ లో ఎలాంటి చర్చ జరుగుతుంది.. తెలంగాణ క్యాబినెట్ లో సీఎం తో కలుపుకుని మొత్తం 18 మంది కి అవకాశం ఉంటుంది.కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం లో సీఎం కాకుండా మరో 11 మందికి మంత్రి వర్గంలో చోటు కల్పించారు.ఇంకా 6 మంత్రి పదవులు కాలీగా ఉన్నాయి. అయితే ఉమ్మడి జిల్లా ల వారిగా చూస్తే ఖమ్మం లో 3, నల్లగొండ 2,వరంగల్ 2, మహబూబ్ నగర్ లో సీఎం తో కలుపుకుని 2 ,మెధక్ లో 1 కరీంనగర్ 2 జిల్లా లలకు ఇప్పటి వరకు మంత్రి వర్గంలో చోటు కల్పించారు.. ఇక ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ ,గ్రేటర్ హైదరాబాద్ ,రంగారెడ్డి జిల్లా లకు మంత్రి వర్గంలో చోటు లభించలేదు. పూర్తి స్థాయి క్యాబినెట్ లో ఈ నాలుగు జిల్లాలకు అవకాశం తప్పక కల్పించాల్సి ఉంది.గ్రేటర్ హైదరాబాద్ లో 24 స్థానాలకు కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎమ్మెల్యే కూడా గెలవలేకపోయింది.ఉమ్మడి రంగారెడ్డి లో వికారాబాద్ ,తాండూరు, పరిగి ,ఇబ్రహీంపట్నం స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది.. అయితే వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కు స్పీకర్ పదవి ఇవ్వగా పరిగి ఎమ్మెల్యే రాం మోహన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మధ్య తీవ్రమైన పోటీ వుంది. అయితే సీనియర్ అయిన మల్ రెడ్డి రంగారెడ్డి కి మంత్రి పదవి ఇచ్చే అవకాశం కనిపిస్తుంది. ఇక నిజామాబాద్ జిల్లాలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాత్రమే సీనియర్..అయితే ఇంకా రెడ్ల కు క్యాబినెట్ లో అవకాశం కల్పిస్తారా..లేక ముస్లిం కోటా లో కామారెడ్డి సొంత నియోజకవర్గం రేవంత్ రెడ్డి కి త్యాగం చేసి, నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేసి ఓడిన షబ్బీర్ అలీ కి స్థానం కల్పిస్తారో చూడాలి.. ఉమ్మడి ఆదిలాబాద్ లో ప్రేమ్ సాగర్ రావు ,వివేక్ బ్రదర్స్ ఇద్దరు సీనియర్ నేతలు ఉండగా వెలమ కోటా లో ఇప్పటికే జూపల్లి కృష్ణారావు కు మంత్రి వర్గంలో చోటు కల్పించారు.. దీంతో ప్రేమ్ సాగర్ రావు కు అవకాశం ఇస్తారోలేదో చూడాలి.. మరో నేత వివేక్ మాల సామాజిక వర్గం నేత.. అయితే డిప్యూటీ సీఎం భట్టి ,స్పీకర్ గడ్డం ప్రసాద్ మాల సామాజిక వర్గం నేతలు కావడం తో వివేక్ కు అవకాశం కల్పిస్తారా అనేది చూడాలి.. ఇక ఉమ్మడి హైదరాబాద్ లో అయితే కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యేలు లేరు కాబట్టి.. రానున్న గ్రేటర్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అంజన్ కుమార్ యాదవ్ కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తారనే టాక్ వినిపిస్తోంది. లేదంటే పాత బస్తీలో పార్టీ బలోపేతం పై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే గా ఓడిన మైనార్టీ ఫిరోజ్ ఖాన్ కి మంత్రి వర్గంలో ఖాయం గా కనపడుతుంది . ఇదిలావుంటే నల్గొండ జిల్లా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైతం తనకు మంత్రి వర్గంలో స్థానం ఖాయం అని ధీమాతో ఉన్నారు.మరోవైపు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తో పాటు ,మాజీ మంత్రి చిన్నారెడ్డి కూడా తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.ఏది ఏమైనా ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిలా లకు జిల్లా కు ఒక మంత్రి పదవి చొప్పున ఇవ్వాలనేది కాంగ్రెస్ ప్లాన్.. మరో రెండు మంత్రి పదవులు పార్టీ బలోపేతం కోసం



కష్టపడ్డవారికి,మైనారిటీకి ఇవ్వాలని కాంగ్రెస్ ఆలోచిస్తోంది.దీంతో కాంగ్రెస్ కు ఎక్కడ ఎవరు అవసరం అనేదానిపై సమాలోచనలు చేస్తున్నారు.మొత్తానికి ఎది ఎమైనా పార్లిమెంట్ ఎన్నికల లోపు పూర్తి స్థాయి క్యాబినెట్ కూర్పు జరిగే అవకాశం కనిపిస్తోంది.. దీంతో చాలా మంది నేతలు క్యాబినెట్ లో బెర్త్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.. ఆ అదృష్టవంతులు ఎవరో తెలియాలంటే కొద్దిరోజులు ఆగాల్సిందే.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215